

నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి గురువారం 28-05-2026 సంపుటి: 02 సంచిక : 27 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Thursday, 28-05-2026 Volume :02 Issue: 27 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani





Contact Number
9059328777


## అట్టహాసంగా టిడిపి మహానాడు ప్రారంభం

- పార్టీ జెండా ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు
- పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళి
- హాజరైన పార్టీ ప్రముఖులు, పోలిట్ బ్యూరో సభ్యులు




**అమరావతి**
తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు-2026 వేడుకలు అమరావతిలో ఘనంగా ప్రారంభమయ్యాయి. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకుని మహానాడు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. టీడీపీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం నందమూరి తారక రామారావుకు నివాళులు అర్పించారు. ఈసారి మహానాడును పూర్తిగా సాంకేతికత ఆధారంగా వర్చువల్ విధానంలో

-మిగతా 2 లో

# కల్లాల వద్ద దైన్యంగా రైతులు

### వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి



- పంటల కొనుగోలు లేక దీనావస్థ
- బిఆర్ఎస్ శ్రేణులు రైతులకు అండగా నిలవాలి
- పార్టీ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు

**హైదరాబాద్,**
రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా అనేక వ్యవసాయ మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వరి, మొక్కజొన్న తదితర పంటలు తీవ్రంగా దెబ్బతినడం అత్యంత బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, రైతాంగానికి అండగా ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ ఆపత్కాలంలో రైతన్నలకు భరోసా ఇవ్వాలని

-మిగతా 2 లో



## 30న కర్ణాటకకు కొత్త సీఎం..

- నేడు సిద్ధరామయ్య రాజీనామా?
- సాయంత్రం 3 గంటలకు గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన సీఎం
- ముఖ్యమంత్రిగా డీకేకు అవకాశం

**బెంగళూరు**
కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం(మే 28) సాయంత్రం 3 గంటలకు తన పదవికి రాజీనామా చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తన రాజీనామా సమర్పించడానికి గురువారం సాయంత్రం 3 గంటలకు ఆయన రాష్ట్ర గవర్నర్ తావర్‌చంద్ గెహ్లాట్ అపాయింట్‌మెంట్ కోరినట్లు వర్గాలు తెలిపాయి. న్యూఢిల్లీలో మంగళవారం కాంగ్రెస్ అధిష్ఠాన వర్గంతో జరిగిన ఉన్నత స్థాయి చర్చల అనంతరం ఊహించిన ఈ చర్య ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రి పదవిని చేపట్టడానికి మార్గం సుగమం చేయనున్నది. కాగా, ముఖ్యమంత్రి

-మిగతా 2 లో



# సర్ సక్రమమే!

### ఈసీ ప్రక్రియను అడ్డుకోలేం

- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సుప్రీంకోర్టు
- ఓటరు జాబితా సవరణలకు ఈసీకి అధికారాలున్నాయి
- నిలిపివేయాలన్న విపక్షాల పిటిషన్ కొట్టివేత
- ఎన్నికల కమిషన్ నిర్ణయానికి ఆమోదముద్ర

**న్యూఢిల్లీ**
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియకు భారత అత్యున్నత న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సాధారణ సవరణ ప్రక్రియకు భిన్నంగా ఉందన్న కారణంతో ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది.

-మిగతా 2 లో

# అకాల వర్షాలు.. హై అలర్ట్!


### అధికారులను హెచ్చరించిన సీఎం రేవంత్ రెడ్డి



- తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసిన వాతావరణ శాఖ
- కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలన్న సీఎం
- మక్కలు, ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఏర్పాటు చేయాలి
- కొనుగోళ్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు

**హైదరాబాద్,**
వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో భారీవర్షాలు, ఈదురుగాలులపై అలర్ట్‌గా ఉండాలని బుధవారం జరిగిన అధికారుల సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని మార్గనిర్దేశం చేశారు. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో

-మిగతా 2 లో




## చంద్రుడి దక్షిణ ధృవంపై మంచు!

- చంద్రయాన్-2 డాటా ఆధారంగా గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు

2



## ఎస్--400 మిస్సైల్స్ రక్షణ వ్యవస్థలు మరిన్ని కావాలి..

- నేడు సిద్ధరామయ్య రాజీనామా?
- సాయంత్రం 3 గంటలకు గవర్నర్
- అపాయింట్‌మెంట్ కోరిన సీఎం
- ముఖ్యమంత్రిగా డీకేకు అవకాశం

2



## త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

- ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తి
- జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు
- కెటిఆర్ సవాల్‌పైనా మరోమారు ఘాటు విమర్శలు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,**
రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 18వేల ఇళ్లు మంజూరు చేశామని మంత్రి వివరించారు. సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్‌తో కలిసి పొంగులేటి మీడియా సమావేశం నిర్వహించారు. తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం.

-మిగతా 2 లో

## తెలంగాణలో తహసీల్దార్ల బదిలీ



- రాష్ట్రవ్యాప్తంగా 12 మంది తహసీల్దార్ల బదిలీ
- డీఆర్ఓ, ఎస్‌డీసీ పోస్టుల్లో కొత్త నియామకాలు
- పరిపాలనా అవసరాలతో ప్రభుత్వం కీలక నిర్ణయం
- వెంటనే విధుల్లో చేరాలని అధికారులకు ఆదేశాలు

**తెలంగాణ బ్యూరో్ప్రతినిధి:**
తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖలో ప్రభుత్వం పలువురు అధికారులను బదిలీ చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. పరిపాలనాపరమైన అవసరాల దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న 12 మంది

-మిగతా 2 లో

## నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు



- వాతావరణ శాఖ హెచ్చరికలు
- ఉరుములు మెరుపులు ఈదురుగాలులకు అవకాశం
- పలు జిల్లాలలో ఆరెంజ్ హెచ్చరికలను జారీ
- ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని స్పష్టీకరణ

**హైదరాబాద్**
తెలంగాణ రాష్ట్రంలో కొద్ది రోజుల నుంచి పగటి పూట భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. సాయంత్ర సమయంతో మాత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కాస్త ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. దీంతో రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి.

-మిగతా 2 లో

# సర్ సక్రమమే!

మొదటి తరువాయి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహించేందుకు ఈసీకి అధికారాలు ఉన్నాయని పేర్కొంది. 'ఎస్ఐఆర్ ద్వారా సాధించాలనుకుంటున్న లక్ష్యానికి, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలనే రాజ్యాంగ లక్ష్యానికి ప్రత్యక్ష సంబంధం ఉందని భావిస్తున్నాం. ఈ ప్రక్రియ ప్రస్తుత ఎన్నికల చట్టాలను ఉల్లంఘించడం లేదు. అంతేకాకుండా ఆర్టికల్ 324 కింద రాజ్యాంగ ఆదేశానికి జీవం పోస్తోంది. ఎన్నికల కమిషన్ తన చట్టబద్ధమైన అధికారాలను అతిక్రమించి వ్యవహరించందని చెప్పలేం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. కాగా, మే 30 నుంచి 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో విడత, చివరి దశ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం కానుంది.

# అకాల వర్షాలు.. హై అలర్ట్!


మొదటి తరువాయి

ఉంచాలని సూచించారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన ప్రాంతాలకు తరలించాలని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

---

# చంద్రుడి దక్షిణ ధృవంపై మంచు!

**చంద్రయాన్-2 డాటా ఆధారంగా గుర్తించిన ఇస్రో శాస్త్రవేత్తలు**




న్యూఢిల్లీ:
ఇస్రో మరో మైలురాయిని అందుకుంది. చంద్రుడిపై నీళ్లు ఉన్నాయని తెలిపే కచ్చితమైన ఆధారాలను గుర్తించింది. చంద్రయాన్-2 డాటా సాయంతో అత్యంత శీతలమైన, రహస్యమైన చంద్రుడి దక్షిణ ధృవం వద్ద మంచు ఉన్నట్టు సైంటిస్టులు గుర్తించారు. గుజరాత్ లోని అహ్మదాబాద్ ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ శాస్త్రవేత్తలు ఈ విషయాన్ని గుర్తించినట్టు ఇస్రో తెలిపింది. చంద్రయాన్ 2 ఆర్బిటార్‌లోని డ్యూయల్ ఫ్రీక్వెన్సీ సింథటిక్ అపర్చర్ రాడార్ (డీఎఫ్ఎస్ఏఆర్) సాయంతో మంచును గుర్తించారు. దక్షిణ ధృవంలోని బిలాల అడుగున ఈ మంచు ఉన్నట్టు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇక్కడ 25 కెల్విన్ లేదా మైనస్ 248 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు ఉంటాయి. బిలియన్ల ఏండ్ల కిందినుంచే ఇక్కడ మంచు ఏర్పడ్డట్టు సైంటిస్టులు చెబుతున్నారు. చంద్రుడి ధ్రువప్రాంతాల్లో మంచు, నీరు ఉన్నాయనేందుకు తాజా ఆవిష్కరణ మరో బలమైన ఆధారంగా నిలువనున్నది.

# తెలంగాణలో తహసీల్దార్ల బదిలీ

మొదటి తరువాయి

తహసీల్దార్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అధికారులకు తక్షణమే అమల్లోకి వచ్చేలా డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్లు (డీఆర్ఓ), స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లుగా కొత్త పోస్టింగులను కేటాయించారు. ఈ బదిలీలకు సంబంధించిన పూర్తి నివేదికను, అధికారులు విధుల్లో చేరిన వివరాలను ప్రభుత్వానికి తక్షణమే సమర్పించాలని భూపరిపాలన ప్రధాన కమిషనర్ తో పాటు సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నూతన ఉత్తర్వుల ప్రకారం బదిలీ అయిన వారిలో నిర్మల్ తహసీల్దార్ మోతీరామ్ ఎ. ను మంచిర్యాల డీఆర్ఓగా, కరీంనగర్‌కు చెందిన బి. రాజేశ్వరిని పెద్దపల్లి డీఆర్ఓగా, పెద్దపల్లికి చెందిన కె.వై. ప్రసాద్‌ను జగిత్యాల డీఆర్ఓగా నియమించారు. అలాగే వనపర్తి నుంచి ఆర్. పాండును నాగర్‌కర్నూల్ డీఆర్ఓగా, ఖమ్మం నుంచి వి. రవికుమార్‌ను ములుగు డీఆర్ఓగా, మేడ్చల్-మల్కాజిగిరి నుంచి జె. స్వామిని కరీంనగర్ డీఆర్ఓగా, నాగర్‌కర్నూల్ నుంచి ఎ. పాండును కామారెడ్డి డీఆర్ఓగా బదిలీ చేశారు. వీరితో పాటు జనగామ తహసీల్దార్ సిహెచ్. శ్రీకాంత్‌ను మహబూబ్‌నగర్ స్పెషల్ కలెక్టర్ పీఏగా నియమించగా, ఎం. సుదర్శన్ రెడ్డి (సూర్యాపేట) ను సిద్దిపేట ఎస్‌డీసీగా, ఎం. రమాదేవి (ఖమ్మం) ను నల్గొండ ఎస్‌డీసీగా, జి. కుమారస్వామి (పెద్దపల్లి) ను సిరిసిల్ల ఎస్‌డీసీగా, ఎన్. వెంకట్ రెడ్డి (కరీంనగర్) ను కరీంనగర్ ఎస్‌డీసీ (ఎల్ఏ) గా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

## 30న కర్ణాటకకు
# కొత్త సీఎం..

మొదటి తరువాయి



పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు సిద్ధరామయ్య తనకు చెప్పారని కాంగ్రెస్ సీనియర్ ఎమ్మెల్యే ఆర్‌వీ దేశ్‌పాండే కూడా బుధవారం ధృవీకరించారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి పదవి కోసం సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య అధికార పోరు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ మార్పు జరగనున్నది.

## ఎస్--400 మిస్సైల్స్ రక్షణ
# వ్యవస్థలు మరిన్ని కావాలి..

**రష్యాను కోరిన భారత్.. కొనసాగుతున్న చర్చలు**



ఇండియా-- రష్యా మధ్య ఉన్న మైత్రి గురించి తెలిసిందే. రక్షణ, సాంకేతికత, చమురు, వ్యాపారం, వాణిజ్యం సహా అనేక అంశాల్లో రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయి. ముఖ్యంగా భారత రక్షణ వ్యవస్థకు రష్యా తోడ్పాటునందిస్తూ వస్తోంది. ఇండియాకు అవసరమైన కొన్ని యుద్ధ విమానాలు, మిస్సైల్స్ వంటివి రష్యా సరఫరా చేస్తోంది. ఇండియాకు రష్యా అందిస్తున్న వాటిలో ఎస్--400 లాంగ్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్ కీలకమైనవి.వీటిని అందించే విషయంలో 2018లో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. 5.4 బిలియన్ డాలర్ల ఒప్పందం మేరకు ఐదు ఎస్--400 క్షిపణి రక్షణ వ్యవస్థల్ని ఇండియాకు రష్యా అందించాలి. 2023 వరకు మూడు రక్షణ క్షిపణి వ్యవస్థల్ని అందించింది. ఇంకో రెండు ఎస్--400 మిస్సైల్స్ సిస్టమ్స్ ఈ పాటికే రావాలి. కానీ, రష్యాకు, ఉక్రెయిన్‌కు మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా వీటిని సమయానికి అందించలేకపోయింది. దీంతో ఈ వ్యవస్థల్ని త్వరగా అందించాలని రష్యాను ఇండియా కోరింది. అంతేకాదు.. మరిన్ని ఎస్--400 మిస్సైల్స్ డిఫెన్స్ సిస్టమ్స్ కొనుగోలు చేసేందుకు కూడా ఇండియా మొగ్గు చూపుతోంది. ఈ అంశంపై రష్యాకు చెందిన ఎఫ్ఎస్‌వీటీఎస్ (ఫెడరల్ సర్వీసెస్ ఫర్ మిలిటరీ-- టెక్నికల్ కోపరేషన్) సంస్థతో ఇండియా చర్చలు జరుపుతోంది. ఈ విషయాన్ని ఆ సంస్థ కూడా వెల్లడించింది. రష్యా నుంచి ఇలాంటి మరింత అదనపు వ్యవస్థల్ని కొనుగోలు చేయాలని ఇండియా భావిస్తోంది. ఇక మిగిలిన ఎస్--400 మిస్సైల్స్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను త్వరలోనే అందిస్తామని ఎఫ్ఎస్‌వీటీఎస్ చీఫ్ దిమిత్రీ షుగయేవ్ ఇటీవల తెలిపారు. నిజానికి ఇవి ఈ నెలలోనే రావాలి. కానీ, వచ్చే నవంబర్ నాటికి అందజేస్తామని తాజాగా రష్యా వెల్లడించింది. అలాగే, ఇండియా కోరినట్లు అదనపు మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ అందించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని దిమిత్రీ తెలిపారు. ఈ మిస్సైల్స్ సిస్టమ్స్.. రష్యా తయారు చేసిన అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థ. అంటే శత్రువులు ప్రయోగించి క్షిపణుల్ని గుర్తించి, గాలిలోనే ఈ వ్యవస్థ నాశనం చేయగలదు. దూరం నుంచి వచ్చే ఎయిర్‌క్రాఫ్ట్, డ్రోన్లు, మిస్సైల్స్, ఖండాంతర క్షిపణుల్ని ఇది అడ్డుకోగలదు. ఇండియా తన రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో వీటిని కొనుగోలు చేస్తోంది.

# త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం

మొదటి తరువాయి

జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం. జీవనోపాధికి అనుగుణంగా ఉండే ప్రాంతాల్లో, నివాసయోగ్యమైన ప్రదేశాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తాం అని వివరించారు. పేదల ఆలోచనలు, సూచనలకు అనుగుణంగానే యుద్ధ ప్రాతిపదికన ఇళ్లు నిర్మిస్తాం. ఒక్క రూపాయి ఫీజు కూడా తీసుకోకుండా మహిళల పేరుమీద రిజిస్ట్రేషన్ న్ చేస్తాం. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పంపిణీ జరుగుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 10 ఇళ్లు కూడా నిర్మించలేదు. మా ప్రభుత్వం వచ్చాక ఒక్కో నియోజకవర్గానికి 3,500కు పైగా ఇళ్లు ఇచ్చాం. రెండో విడతలో 2వేల ఇళ్లు కేటాయిస్తాం అని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ఇందిరమ్మ ఇళ్లపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సవాల్ విసిరారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే ఎక్కువ కడితేనే తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. లేదంటే ఎమ్మెల్యేగా కూడా పోటీ చేయనని పేర్కొన్నారు. మీకంటే ఎక్కువ ఇళ్లు నిర్మిస్తే.. మీరు పోటీకి దూరంగా ఉంటారా? అంటూ కేటీఆర్‌ను పొంగులేటి శ్రీనివాసరెడ్డి సవాల్ విసిరారు. వీరిద్దరి మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. తెలంగాణ రాజధాని హైదరాబాద్ మహానగరంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు కట్టినట్లు నిరూపించినా.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ సవాల్‌పై మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ట్విట్టర్ వేదికగా స్పందించారు. మే 23వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో హైదరాబాద్‌లోని మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తొలి రెండున్నర ఏళ్లలోనే రాష్ట్రంలో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామన్నారు. ఇందిరమ్మ పాలన అంటే ఏమిటో గ్రామాల్లోకి వెళ్లి ఆ ఇళ్లు కట్టుకున్న కుటుంబాలను అడిగితే తెలుస్తుందని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌లలో ఉంటే ఏం తెలుస్తుందంటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి చురకలంటించారు. అలాగే జూన్ 1వ తేదీన మరో 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారని వివరించారు. అసెంబ్లీ ఎన్నికల నుంచి నిన్న మొన్నటి వరకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటిందని కేటీఆర్‌కు పొంగులేటి గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ ఇచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్‌కు పొంగులేటి స్పష్టం చేశారు. దాంతో మీరు ప్రత్యేకంగా రాజకీయ సన్యాసం తీసుకోనక్కర్లేదరటూ కేటీఆర్‌కు మంత్రి పొంగులేటి వ్యంగ్యంగా అన్నారు.

# నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు

మొదటి తరువాయి

ఒక వైపు మండుతున్న ఎండల వల్ల ప్రజలు వడదెబ్బకు గురవుతుంటే, మరోవైపు అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంటలు నేలపాలై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటున్నాయో అని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రాత్రి వానలు బీభత్సాన్ని సృష్టించాయి. వరుణుడి దాటికి రైతుల బతుకులు అతలాకుతలం అయ్యాయి. రాగల నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు : తెలంగాణ రాష్ట్రంలో అనేక చోట్ల వడగండ్లతో కూడిన ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. వేడిగా ఉన్న భూభాగం మీదకు తేమ గాలులు ప్రవేశించడం వల్ల అకాల వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వీటినే మేసకాలంలో కురిసే ప్రీ మాన్‌సూన్ జల్లులంటారని పేర్కొంది. రాగల నాలుగైదు రోజుల పాటు అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఇవాళ ఆదిలాబాద్, కుమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు మెరుపులు ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నాయని తెలిపారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలను జారీ చేసినట్లు చెప్పారు. అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు ఉండదని వాతావరణ కేంద్రం వివరించింది. ఇవాళ, రేపు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో కొన్నింటికి రెడ్ అలర్ట్ జారీ చేశామని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు వివరించారు. చిరు జల్లుల వాతావరణం కొనసాగుతోంది : వేసవి కాలంలో భూభాగం బాగా వేడెక్కి 40 నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్నప్పుడు అదే సమయంలో విండ్ డైరెక్షన్లు మార్పులు వచ్చి తేమ గాలులు సముద్ర ప్రాంతం నుంచి భూ ప్రాంతాన్ని ప్రవేశించినప్పుడు మధ్యాహ్న సమయంలో క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడుతుంటాయని శ్రీనివాస్ రావు అన్నారు. దీంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, పిడుగుపాటు, వడగండ్ల వాతావరణం ఉంటుందని తెలిపారు. గత నాలుగైదు రోజుల నుంచి తెలంగాణలో హీట్ వేవ్ వాతావరణం ఉత్తర, తూర్పు తెలంగాణలో కొనసాగుతోంది. దక్షిణ, పశ్చిమ తెలంగాణలో చిరు జల్లుల వాతావరణం కొనసాగుతోందని వివరించారు. "నిన్న సుమారు 21 జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడ్డాయి. ఈరోజు తూర్పు, ఉత్తర తెలంగాణ ప్రాంతాల్లో జల్లులు పడే అవకాశం ఉంది. నిన్న ఎక్కడైతే ఎక్కువ వర్షాలు పడ్డాయో అక్కడ ఈరోజు తక్కువ వర్షాలు పడే అవకాశం ఉంది. ఇవి హీట్ వేవ్ వర్షాలు కావడంతో ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో దీని ప్రభావం ఉంటుంది" అని వాతావరణ శాఖ అధికారి - శ్రీనివాస్ రావు, తెలిపారు.

# కల్లాల వద్ద దైన్యంగా రైతులు

మొదటి తరువాయి

పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలతో సహా రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజులుగా కురిసిన అకాల వర్షాలకు పలు మార్కెట్ యార్డుల్లో వడ్లు వర్షానికి కొట్టుకుపోతుంటే రైతన్నలు కన్నీరుమున్నీరు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు లేక సెల్‌ఫోన్‌ల వెలుతురులో రైతులు తమ ధాన్యాన్ని కాపాడుకోవడానికి పడుతున్న అవస్థలు ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వ అసమర్థత, ముందుచూపు లేకపోవడం వల్లే నేడు రైతన్నలు ఈ దుస్థితిని ఎదుర్కొంటున్నారని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న తీవ్ర జాప్యం వల్లే రైతుల ఆరుగాలం కష్టం కళ్లముందే నీళ్లపాలవుతోందని ధ్వజమెత్తారు. ఈ కష్టకాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో రైతాంగానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని కేటీఆర్ సూచించారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తక్షణమే తమ తమ పరిధిలో అకాల వర్షాల వల్ల ప్రభావితమైన అన్ని మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలను సందర్శించాలని ఆదేశించారు. రైతుల పక్షాన నిలబడి ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేలా, రైతులకు న్యాయం జరిగేలా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెంచాలని దిశానిర్దేశం చేశారు. మార్కెట్ యార్డుల్లో తడిసిన వరి, మొక్కజొన్న తదితర ధాన్యాన్ని తేమ శాతం, తరుగు లాంటి ఎలాంటి సాకులు చెప్పకుండా బేషరతుగా కనీస మద్దతు ధరకు (ఓ÷ాఖ) ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మొద్దునిద్ర వీడి, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## అట్టహాసంగా టిడిపి
# మహానాడు ప్రారంభం

మొదటి తరువాయి

నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్లలో 1851 క్లస్టర్లను పార్టీ కేంద్ర కార్యాలయంతో అనుసంధానం చేశారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక క్లస్టర్‌ను ÷ులినీ-చిజా కమ్యూనికేషన్ సిస్టమ్ ద్వారా నేరుగా అనుసంధానిస్తూ నాయకులు, కార్యకర్తలతో మమేకం కానున్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రతి క్లస్టర్‌లో భారీ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది మహానాడు ప్రత్యేకంగా 'స్త్రీ శక్తి' థీమ్‌తో నిర్వహిస్తున్నారు. మహిళా సాధికారత, పార్టీ నిర్మాణంలో మహిళల పాత్ర, సామాజిక సేవలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా చర్చలు జరగనున్నాయి. అదేవిధంగా 'కార్యకర్తే అధినేత, యువగళం, పేదల సేవలో టీడీపీ' వంటి అంశాలపై కూడా కీలక చర్చలు జరగనున్నాయి. మహానాడులో మొత్తం 10 కీలక తీర్మానాలపై చర్చించి ఆమోదం తెలపనున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయానికి పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ ప్రతినిధులు, పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. ఇప్పటికే మహానాడు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన పార్టీ శ్రేణులు, పసుపు జెండాలతో కేంద్ర కార్యాలయాన్ని అలంకరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మహాసభలను పార్టీ శ్రేణులు 'పసుపు పండుగ'గా అభివర్ణిస్తున్నాయి. ఉదయం 10:40 గంటలకు చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రారంభ ఉపన్యాసం ఇచ్చారు. అనంతరం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ ప్రసంగించారు. రాబోయే రాజకీయ వ్యూహాలు, ప్రభుత్వ పనితీరు, పార్టీ బలోపేతం, యువత, మహిళల పాత్రపై పలువురు నేతలు కీలక సందేశాలు ఇచ్చారు. మహానాడు-2026 ద్వారా పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశర ఇవ్వడంతో పాటు, గ్రామస్థాయి కార్యకర్తలతో ప్రత్యక్ష అనుసంధానం పెంచడంపై టీడీపీ హై కమాండ్ ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

# రైతుల పేరుతో కాంగ్రెస్ రాజకీయ డ్రామాలు మానుకోవాలి

- తెలంగాణ లో పెట్రోల్ డిజిల్ పైన వ్యాట్ తగించండి
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి


బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి

**మిడ్జిల్, మే 27, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** తెలంగాణ రాష్ట్రంలోకాంగ్రెస్ పార్టీ నాయకులు రైతుల పేరుతో రాజకీయ డ్రామాలు ఆడటం మానుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొంటూ.. పెట్రోల్, డీజిల్ రేట్లు తగ్గించాలంటే ముందుగా తెలంగాణలో పెంచిన వ్యాట్ భారం తగ్గించాలని ఆయన స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే అధిక పన్నులు వసూలు చేస్తున్న నిజాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించాలని ఆయన సవాల్ విసిరారు. రైతులను మోసం చేసింది ఎవరు అనేది ప్రజలకు బాగా తెలుసని ఆయన అన్నారు. ఎన్నికల ముందు ఎకరాకు రూ.15,000 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు వంద శాతం అమలు చేయలేకపోయారని, అలాగే రూ. 2 లక్షల రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఆయన విమర్శించారు. వాస్తవాలు దాచిపెట్టి కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని, రైతుల సమస్యలపై నిజాయితీగా పనిచేయకుండా కేవలం మీడియా స్టంట్స్ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014తో పోలిస్తే వరి మద్దతు ధర సుమారు రూ.1380 నుంచి రూ.2389కి పెరిగిందని, మక్క, జొన్న పంటలు రూ.1400 నుంచి రూ.2400 వరకు పెరిగాయని, పత్తి ధర కూడా గణనీయంగా పెరిగి రైతులకు లాభదాయక స్థాయికి చేరిందని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 16 రకాల పంటలకు ఎంఎస్పి పెంచి రైతులకు చారిత్రాత్మక మద్దతు అందిస్తుండగా, అంతర్జాతీయంగా ఎరువుల ధరలు పెరిగినా భారీ సబ్సిడీలతో రైతులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి పని చేయకుండా రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనైనా వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా.బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి హెచ్చరించారు..

# ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు

- తెలియజేసిన మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీడి.జానకి ఐపీస్



**మిడ్జిల్, మే 27, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీస్ జిల్లా ముస్లిం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి, ప్రేమకు, మానవత్వానికి ప్రతీకగా నిలిచే పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. ప్రజలంతా పరస్పరం మతాలను గౌరవించుకుంటూ సోదరభావంతో పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ తరపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈద్గాలు, మసీదులు మరియు ప్రార్థనా స్థలాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అలాగే సోషల్ మీడియాలో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించిన ఎస్పీ గారు, ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా పోస్టులు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712659360 లేదా డయల్-100 ను సంప్రదించాలని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీస్ కోరారు.

# రైతుల బాధలు పట్టని ప్రభుత్వం

- తడిసిన ధాన్యానికి పరిహారం ఇవ్వాలి
- బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**మిడ్జిల్,మే 27, (నేటి దర్శిని ప్రతినిధి) :** తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఎంతో కష్టపడి పండించి న వడ్లు కొనుగోలు కాక కొనుగోలు కేంద్రాల వద్దే పేరుకుపోతున్నాయనీ రైతుల బాధలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోజుల తరబడి ఎదురు చూస్తున్న రైతులకు సరైన సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేశం వ్యక్తం చేశారు. ఇప్ప టికే అకాల వర్షాలతో వడ్లు తడిసిపోవడంతో రైతులు భారీ నష్టాలను చవిచూస్తు న్నారన్నారు.పండించిన పంటకు ధర రాక, కొనుగోలు ఆలస్యం కావడం, తడిసిన ధాన్యాన్ని తిరస్కరించడం వల్ల రైతు ఆవేదనలో ఉన్నా డనీ అన్నారు.రైతు చెమట తో పండిన ప్రతి గింజకు విలువ ఇవ్వాల్సిన ప్రభు త్వం, రైతుల కన్నీళ్లు కనిపిం చకపోవడం దురదృష్ట కరనన్నారు.రైతుల సమ స్యలు ప్రభుత్వానికి కనిపించడం లేదా?అని ప్రశ్నించారు.రైతు కష్టం గుర్తు కురాకపోతే, రైతు సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ప్రభుత్వానికి లేదని అన్నా రు.వెంటనే వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలనీ, అకాల వర్షాలతో నష్టపోయి న రైతులకు తక్షణ పరిహారం అందించాలనీ, రైతును ఆదుకునే చర్యలు వెంటనే చేపట్టాలనీ డిమాండ్ చేశారు.


బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

# త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, మే 27(నేటి దర్శిని);** త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ (ఈద్.. ఉల్.. అదా) పండుగ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల ముస్లిం, మైనారిటీ సోదర సోదరీమణులకు కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు గురువారం జరుపుకోనున్న బక్రీద్ పండుగను పురస్కరించుకొని బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగం, సహనం, జాలి దయ సేవా గుణాలను ప్రతిబింబిస్తుందన్నారు. ఈ పవిత్ర పండుగను నియోజకవర్గంలోని అన్ని మండలాల ముస్లిం మైనారిటీ సోదరులతో పాటు కుల మతాలకు అతీతంగా ప్రజలంతా సోదరా భావంతో, ఐక్యంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో త్యాగం,సహనం, ప్రేమ ,దయా గుణాలను అలవర్చుకోవాలన్నారు. ఈద్గాలు మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించుకొని బక్రీద్ పండుగను సంబురంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన కోరారు. ఈద్.. ఉల్.. అదా పండుగ ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లి విరియాలని, అల్లా దీవెనలు అందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఆయన అన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ ముఖ్యంగా ముస్లిం సోదరులకు ఆత్మీయ శుభాకాంక్షలు అని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలియజేశారు.

# వర్షం కారణంగా రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు





**ఆమనగల్లు,మే27(నేటి దర్శిని):** ఆమనగల్ మార్కెట్ యార్డులో గత రెండు రోజులుగా ఈదురుగాలులతో కూడిన వర్షం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. బుధవారం మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు తాళ్ల రవీందర్ పల్లె జంగయ్య సంపత్ కుమార్ రమేష్ గౌడ్ ఉదయం నుండి ఆమనగల్ మార్కెట్లో రైతులకు అందుబాటులో ఉంటూ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షం కారణంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వెనువెంటనే పిఎసిఎస్ కేంద్రాలు ఇప్పటికే టోకెన్లు ఇచ్చిన రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, నేచర్ వచ్చిన ధాన్యానికి టోకెన్లు ఇవ్వాల్సిందిగా ఏ ఈ ఓ బాలకృష్ణను ఆదేశించారు. ఆమునగల్ పిఎసిఎస్ సీఈవో దేవేందర్ ను వెంటనే యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని ఆదేశిస్తూ తరుగు పేరుతో రైతులు పండించిన ధాన్యాన్ని నష్టాన్ని కలుగచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా రైస్ మిల్లులో ధాన్యం నిల్వలు ఎక్కువగా ఉన్నందున లారీలు సకాలంలో అన్లోడ్ చేసుకోవడం లేదని లారీ యజమానులు వైస్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే మిల్లర్లతో మాట్లాడి సమస్యను పరిష్కరించడం జరిగిందని రోజు దాదాపు 1500 బస్తాలు ధాన్యం మార్కెట్ నుండి తరలిస్తామని వైస్ చైర్మన్ తెలిపారు. రెండు మూడు రోజుల్లో ధాన్యాన్ని రైతుల నుండి సేకరిస్తామని తెలిపారు. స్థానిక రైతులతో మాట్లాడి వారికి ప్రభుత్వం అందిస్తున్న గిట్టుబాటు మద్దతు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

# ఉర్కొండ నూతన ఎస్ఐ గా రమాదేవి నియామకం..




**మిడ్జిల్, మే 28, (నేటి దర్శని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** ఊర్కొండ మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఎస్ఐగా నియమితులైన రమాదేవి మంగళవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్ఐ రమాదేవి మాట్లాడుతూ, మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు చిత్తశు ద్ధితో పనిచేస్తానని తెలిపారు. మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యత ఇస్తామని, గ్రామాల్లో గంజాయి, అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెడతామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై సత్వరమే స్పందిస్తామని ఎస్ఐ రమాదేవి స్పష్టం చేశారు.

# గాలివాన బీభత్సం.. నేలమట్టమైన బత్తాయి తోట


- కాపుకు వచ్చిన 40 బత్తాయి చెట్లు కూలి రైతుకు భారీ నష్టం



**గుర్రంపోడు మే 27(నేటి దర్శిని):** నల్గొండ జిల్లా గుర్రంపోడు మండలం పాల్వాయి గ్రామంలో అకాల వర్షం, ఈదురుగాలుల కారణంగా రైతుకు తీవ్ర నష్టం సంభవించింది. గ్రామానికి చెందిన రైతు గట్టుపల్లి మల్లారెడ్డి సాగు చేస్తున్న బత్తాయి తోటలో కాపుకు సిద్ధమైన సుమారు 40 చెట్లు గాలిదుమారానికి ఒక్కసారిగా నేలకొరిగిపోయాయి. ఎన్నో ఏళ్లుగా శ్రమించి పెంచుకున్న తోట ఒక్క రాత్రిలో ధ్వంసం కావడంతో రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో ప్రకృతి విపత్తు మరింత ఆర్థిక భారాన్ని మోపిందని వాపోయాడు. కాపుకు వచ్చిన బత్తాయి చెట్లు కూలిపోవడంతో లక్షల్లో నష్టం వాటిల్లిందని రైతు తెలిపాడు. కుటుంబ పోషణపై తీవ్ర ప్రభావం పడిందని కన్నీటి పర్యంతమయ్యాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యాన రైతులను ఆదుకుని తగిన నష్టపరిహారం అందించాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

## సంపాదకీయం

# ఎండ ప్రచండం



తెలంగాణ రాష్ట్రంలో ఈసారి మండుటెండలు మరణ మృదంగాన్నీ సృష్టిస్తు న్నాయి. అనేక జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 'సీవియర్ హీట్‌వేవ్' నమోదు చేస్తున్నాయి. చాలాచోట్ల ఎండ వేడి తట్టుకోలేక జనాలు పిట్టల్లా రాలుతున్నారు. ఒకరోజు యాభై ఒక మంది, మరుసటి రోజు ఇరవై రెండు మంది, ఇంకోరోజు ముప్పయి మంది, ఇలా ఈ మూడు రోజుల లెక్కల్ని వింటేనే గుండె తరుక్కుపోతోంది. మృతులు వందకు పైగా దాటడం తీవ్ర విషాదకరం. ఉదయం పనికెళ్లిన మనిషి సాయంత్రానికి శవంగా ఇంటికి రావడం, 'కొద్దిసేపట్లో వస్తా'నని బయలుదేరిన తండ్రి దారిలోనే కుప్పకూలడం విచారకరం. ఇలాంటి దారుణమైన పరిస్థితుల్లో పొద్దంతా చెమడొడిస్తేగానీ ముద్ద నోట్లోకి వెళ్లని శ్రమజీవుల సంగతేమిటి? ఈ వేసవిలో వారి బతుకు చిత్రం ఒక్కసారిగా ఆందోళనకరంగా మారింది. ఇంట్లో ఉంటే పూట గడవదు, బయటకు వెళ్తే మరణం తప్పదన్న దుస్థితి ఎదురైతే వారు ఎవరికి చెప్పుకోవాలి? వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాద్, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో నలభై ఆరు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పెద్దపల్లి జిల్లాలో నలభై ఏడు డిగ్రీలు అత్యధికం. భారత వాతావరణ శాఖ (ఐఎండి) ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, భద్రాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసింది. ఉదయం తొమ్మిది గంటలకే జనం బయట అడుగుపెట్టడం లేదు. మధ్యాహ్నం అయితే గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. పట్టణాల్లో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. కానీ పొలాల్లో పనిచేస్తున్న రైతులు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి కూలీలు ఈ ఎండల్లో కుప్పకూలుతున్న దయనీయ స్థితి నెలకొంది. ఎందుకంటే, పేదరికం వారిని ఇంట్లో ఉండనివ్వదు. ఆకలి వాళ్లను ఎండలోకి నెట్టేస్తోంది. చివరకు అదే ఎండ వారి ప్రాణాలను కూడా మింగేస్తోంది. ఈ విపత్కర పరిస్థితులకు కారణాలను విశ్లేషిస్తే ఒకటి ఎల్‌నినో ప్రభావం, రెండోది కార్పొరేట్ల ధనదాహం. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయి. భారత దేశంలో ముఖ్యంగా దక్షిణ రాష్ట్రాల్లో తీవ్రమైన వేడి తరంగాలు నమోదవు తున్నాయి. కానీ, ప్రకృతి ఒక్కటే కాదు. చెట్ల నరికివేత, చెరువుల మాయం, కాంక్రీట్ నగరాల పెరుగుదల, పచ్చదనం తగ్గిపోవడం కూడా ఈ వేడిని మరింత భయంకరంగా మార్చేస్తున్నాయి. అయితే, ఈ వినాశనంలో పాలకవర్గాల పాత్ర ప్రధానం. లాభాల కోసం ప్రకృతిని విచక్షణా రహితంగా దోచుకుంటున్న కార్పొరేట్ విధానా లు, వాటికి అనుగుణంగా రూపొందుతున్న ప్రభుత్వ నిర్ణయాలే పర్యావరణ సంక్షోభాన్ని అసలు కారణాలు. వేలాది ఎకరాల అడవిని ఆదానీ, అంబానీ లాంటి ప్రయివేటు కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారు. వారేమో ఖనిజ సంపదకోసం లక్ష?లాది చెట్లను నరికేస్తున్నారు. దీంతో అడవులు కనుమరుగవుతున్నాయి. ఇంకా, గనుల తవ్వకాలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, భారీ పరిశ్రమలు, పారిశ్రామిక కారిడార్లు, ప్రత్యేక ఆర్థిక మండలాల కోసం లక్షల ఎకరాల భూమి వినియోగిస్తున్నారు. ఇదే వాతావరణ సమతుల్యతను దెబ్బతీసి భూమి ఉష్ణోగ్రతలను పెంచుతోంది. ఏడాదికేడాది ఎండలు పెరుగుతున్నా, ప్రభుత్వాల సిద్ధత మాత్రం పాత స్థాయిలోనే ఉంది. అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే? వడదెబ్బతో చనిపోతున్న వాళ్లలో ఎక్కువ మంది పేదలే. ఏసీ గదుల్లో ఉండేవాళ్లు కాదు. రోజు పనిచేసి కుటుంబాన్ని పోషించుకునే రైతులు, కూలీలు, ఆటోడ్రైవర్లు. ఇప్పుడు చనిపోయిన వారిలో కూడా వారే ఎక్కువ. అంటే ఈ మరణాలకు కారణం కేవలం సూర్యుడి వేడి కాదు, సామాజిక అసమానత కూడా అందులో దాగుంది. అయినా, పర్యావరణం గురించి ఎవరూ మాట్లాడటం లేదు. ఒకప్పుడు గ్రామాల్లో పెద్దపెద్ద చెట్లు ఉండేవి. ఇపుడు వాటి స్థానంలో సిమెంట్ గోడలు వచ్చాయి. పట్టణాల్లో బస్‌స్టాప్‌లకు సరైన షెడ్లు కూడా లేవు. చలివేంద్రాలు కనిపించడం కూడా అరుదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేల్కోవాలి. పట్టణాభివృద్ధి పేరుతో చెట్లను నరికి వేసి, తర్వాత "హరితహారం" పేరుతో మొక్కలు నాటితే సరిపోదు. పర్యావరణాన్ని కాపాడకుండా ఈ వేడి సంక్షోభం తగ్గదు. చెరువులు, పార్కులు, పచ్చదనం పెరగాలి. అందుకు బృహత్తర కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాలి. ఎందుకంటే, దేశమే కాదు, మన రాష్ట్రమూ ప్రమాదకర అంచున నిలబడి ఉంది. ఎండలు ప్రతిసంవత్సరం వచ్చేవే. కానీ, గతేడాదితో పోలిస్తే ఈ సారి మరణాలు రెట్టింపు పెరిగాయి. ఈ ఒక్కో మరణం వెనుక కుటుంబ శోకం, దాని వెనుక పిల్లల ఆర్తనాదాలు ఉన్నాయి. ఇప్పటివరకు చనిపోయిన వారి కుటుంబాలను ప్రకృతి విపత్తుల కింద ప్రభుత్వాలు ఆదుకోవాలి. ఇది ప్రకృతి, పాలన కలిపి సృష్టించిన సంక్ష?భం. దీనికి అడ్డుకట్ట వేయకుంటే, రోజురోజుకూ వార్తల్లో మరణాల సంఖ్య మారుతుంది. కానీ, పేదల ఇళ్లలో వినిపించే ఏడుపు మాత్రం అలాగే ఉంటుంది. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలు ప్రభుత్వాలను క్ష?మించవు.

# ఈడీ దాడులపై భగ్గుమన్న సిపిఎం

**-కేరళలో పలు చోట్ల ఆందోళనలు**
**-బిజెపితో కాంగ్రెస్ చేతులు కలిపిందన్న నేతలు**



**తిరువనంతపురం, న్యూఢిల్లీ మే 27 (నేటి దర్శిని)**
కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) పొలిట్ బ్యూరో సభ్యుడు, కేరళం శాసనసభ ప్రతిపక్ష నాయకుడైన పినరయి విజయన్ నివాసంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడులను సిపిఎం ఖండించింది. రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం కేంద్ర ఏజెన్సీలను నిరంతరం ఉపయోగించడంలో ఇది ఒక భాగమని సిపిఎం అభివర్ణించింది. సిపిఎం, ఇతర ప్రతిపక్ష శక్తులపై జరుగుతున్న విస్తృత రాజకీయ వేధింపులు, వ్యక్తిత్వ హననంలో ఈ దాడులు ఒక భాగమని సిపిఎం పేర్కొంది. ఈ చర్య కేరళ వ్యాప్తంగా తీవ్ర నిరసనలకు దారితీసింది. పలు జిల్లాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. పినరయి విజయన్ నివాసంపై ఈడీ దాడిని సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ ఖండించారు. ఒక ప్రముఖ ప్రతిపక్ష నాయకుడిపై భారతీయ జనతా పార్టీ (బిజెపి) ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిగా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఈ పోస్టులో 'ఇలాంటి చర్యలు పినరయి విజయన్‌ను గానీ, సిపిఎంను గానీ భయపెట్టలేవని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో యూడీఎఫ్ ప్రభుత్వానికి కూడా ప్రమేయం ఉందా అని ఆయన ప్రశ్నించారు. ÷ఖనియర్ నాయకుడు, కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌పై ఈడీ జరిపిన దాడిని రాజ్యసభ ఎంపీ జాన్ బ్రిట్టాస్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్ట్ చేశారు. 'రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి, లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర సంస్థలను పద్ధతి ప్రకారం దుర్వినియోగం చేయడానికి ఇది మరో ఉదాహరణ. ఇటువంటి కక్షపూరిత చర్యలు నిరంకుశ మనస్తత్వాన్ని బయటపెడతాయి. ఈ అప్రజాస్వామిక ఎత్తుగడలకు పినరయి, సిపిఎం బెదరబోవు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడానికి, ప్రజల మద్దతుతో సిపిఎం దృఢంగా పోరాడుతుంది. అరవింద్ కేజ్రీవాల్ విషయంలో చేసినట్లే, ఆయనను లక్ష్యంగా చేసుకోవడానికి కాంగ్రెస్ నాయకత్వం ఈడీని చురుకుగా ప్రోత్సహించిందన్నది స్పష్టం' అని పేర్కొన్నారు. రాజకీయ ప్రత్యర్థులపై కేంద్ర సంస్థలను ఉపయోగించుకోవడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు కాంగ్రెస్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేతులు కలిపిందని సిపిఎం పేర్కొంది. రాజకీయ ప్రయోజనాల కోసం దర్యాప్తు సంస్థలను ఆయుధాలుగా మార్చే ప్రయత్నాన్ని కేరళ ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకున్నారని తెలిపింది. ఈ చర్యను ప్రతిఘటించాలనే తమ సంకల్పాన్ని పునరుద్ఘాటిస్తూ, కేరళ వ్యాప్తంగా ప్రజలను సమీకరించి, ప్రజాస్వామ్య నిరసనలు, సామూహిక కార్యాచరణ ద్వారా ఈ రాజకీయ దాడులను ఎదుర్కొంటామని సిపిఎం పేర్కొంది. ఈడీ నిర్వహిస్తున్న సోదాలకు వ్యతిరేకంగా కేరళతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. రాజకీయ కక్షసాధింపులో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని ఆగ్రహిస్తూ పార్టీ శ్రేణులు, ప్రజలు వీధుల్లోకి వచ్చారు. కన్నూర్‌లోని పినరయి విజయన్ కుటుంబ నివాసం, తిరువనంతపురంలోని బేకరీ జంక్షన్‌లో ఉన్న ఆయన అ÷-దదె ఇంటి ముందు సిపిఎం నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై కూర్చొని నిరసన చేపట్టారు. తిరువనంతపురంలో జరిగిన ఆందోళనలో సిపిఎం కేరళం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిదన్, వి.శివన్‌కుట్టి, జాన్ బ్రిట్టాస్, వి. జాయ్, అనవూర్ నాగప్పన్, వి.కె. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. కన్నూర్‌లో జరిగిన నిరసనలో ఎం.వి. జయరాజన్, పి. జయరాజన్, కె.కె. రాజేష్, కె.కె. శైలజ తదితరులు పాల్గొన్నారు. కోజికోడ్ జిల్లాలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ మాట్లాడుతూ? ఈడీ సోదాలు పార్టీపై, పినరయి విజయన్‌పై జరిగిన 'హేయమైన రాజకీయ దాడి'గా పేర్కొన్నారు. ఈ చర్యల వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశాలను ప్రజల ముందు బట్టబయలు చేస్తామని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ మాట్లాడుతూ, పినరయి విజయన్‌కు ఎక్సాలాజిక్ వ్యవహారంతో ప్రత్యక్ష సంబంధం లేదని కోర్టులు ఇప్పటికే పేర్కొన్నప్పటికీ, రాజకీయ వేధింపులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# అహ్మదాబాద్‌లో ఎబోలా కలకలం.

**- కాంగో జాతీయుడు సహా ముగ్గురి ఐసోలేషన్**




**న్యూఢిల్లీ మే 27 (నేటి దర్శిని)**
గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లో ఎబోలా కలకలం రేపింది. ఎబోలా అనుమానితులైన కాంగో జాతీయుడు సహా మరో ముగ్గురిని ఐసోలేషన్‌లో ఉంచారు. ఈ విషయాన్ని గుజరాత్ ఆరోగ్య శాఖ మంత్రి ప్రఫుల్ పన్షేరియా బుధవారం వెల్లడించారు. వీరి నుంచి శాంపిల్స్ సేకరించి, ఎబోలా పరీక్షా కేంద్రానికి పంపించినట్లు ఆయన తెలిపారు. మరోవైపు అంతకుముందు కర్ణాటక రాజధాని బెంగళూరులో కూడా ఉగాండా నుంచి వచ్చిన ఒక మహిళలో ఎబోలా లక్షణాలు ఉండటంతో అక్కడి అధికారులు అప్రమత్తమయ్యారు.ఆమెను బెంగళూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన అధికారులు అక్కడ ఐసోలేషన్‌లో ఉంచారు. అనంతరం ఆమె నుంచి శాంపిల్స్ సేకరించి ఎబోలా పరీక్షల కోసం పంపారు. ఈ ఫలితాల్లో ఆమెకు నెగెటివ్ వచ్చినట్లు కర్ణాటక ఆరోగ్య శాక మంత్రి దినేష్ గుండు రావ్ తెలిపారు. అందువల్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన సూచించారు. ప్రజల ఆరోగ్యం, అప్రమత్తత దృష్ట్యా ప్రతి ఒక్కరూ తగిన మెడికల్ ప్రోటోకాల్, ముందు జాగ్రత్త చర్యలు అనుసరించాలని ఆయన కోరారు. బెంగళూరుకు వచ్చిన మహిళ ఉగాండా నుంచి ఈ నెల 23న కెంపెగౌడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. అనంతరం ఆమెను వైద్యాధికారులు నిరంతరం పర్యవేక్షించారు. ఈ క్రమంలో ఎబోలా లక్షణాలు కనిపించడంతో అధికారులు ఆమెను ఐసోలేషన్‌లో ఉంచి పరీక్షలు నిర్వహించారు.ప్రస్తుతం ఎబోలా గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే ప్రయాణికుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. దేశంలో ఎబోలా వ్యాపించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. మరోవైపు ఆఫ్రికాలో ఎబోలా వేగంగా వ్యాపిస్తోంది. అందులోనూ కాంగోలో ఎక్కువగా వ్యాపిస్తుండటంతో పొరుగు దేశమైన ఉగాండా తన సరిహద్దును మూసేసింది.

# అత్తమామలు సర్దుకుపొమ్మని చెప్పడం క్రూరత్వం కాదు



**న్యూఢిల్లీ మే 27 (నేటి దర్శిని)**
భార్యాభర్తల మధ్య జరిగే గొడవల్లో అత్తమామలు మౌనంగా ఉన్నంత మాత్రాన వారిపై వరకట్న వేధింపుల కేసులు పెట్టలేమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. నైతికంగా ఆ ప్రవర్తన తప్పుకావచ్చు కానీ, దాన్ని క్రిమినల్ నేరంగా పరిగణించలేమని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. భర్త కుటుంబ సభ్యులందరినీ గుడ్డిగా కేసుల్లోకి లాగడం సరికాదని వ్యాఖ్యానించింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్కే సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది. భర్తకు మద్దతు ఇచ్చారనో, గొడవల్లో జోక్యం చేసుకోలేదనో లేదా సర్దుకుపోవాలని సలహా ఇచ్చారనో అత్తమామలపై క్రిమినల్ చట్టాలను ప్రయోగించలేమని కోర్టు తెలిపింది. సర్దుకుపొమ్మని సలహా ఇవ్వడం క్రూరత్వం కాదని స్పష్టంచేసింది.నేరంలో వారి ప్రత్యక్ష భాగస్వామ్యం లేదా నిర్దిష్టమైన పాత్ర ఉంటే తప్ప కేవలం సాధారణ ఆరోపణలతో అత్తమామలను దోషులుగా నిలబెట్టలేమని ధర్మాసనం వివరించింది. మధ్యప్రదేశ్‌లోని గుణ ప్రాంతానికి చెందిన ఓ మహిళ తన భర్త, అత్తమామలపై పెట్టిన వరకట్న వేధింపుల కేసును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా కొట్టివేసింది. సదరు మహిళ తన అత్తమామలపై ఎలాంటి నిర్దిష్టమైన ఆరోపణలు చేయలేదని కోర్టు గుర్తించింది. విఫలమైన వివాహ బంధంలో మహిళ పడే వేదనను తక్కువ చేసి చూడలేమని చెబుతూనే ఇలాంటి వైవాహిక వివాదాల కేసులను విచారించేటప్పుడు కింది కోర్టులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని, ఆరోపణలను క్షుణ్నంగా పరిశీలించాలని సూచించింది. వైవాహిక వివాదాల్లో తీవ్రమైన భావోద్వేగాలు, వ్యక్తిగత కక్షలు దాగి ఉంటాయని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సమయాల్లో కేవలం భర్తపైనే కాకుండా, గొడవలతో ఎలాంటి సంబంధంలేని అతని కుటుంబ సభ్యులందరినీ కేసుల్లో ఇరికించే ధోరణి ఎక్కువగా కనిపిస్తోందని ఆందోళన వ్యక్తంచేసింది. నిందితులుగా చేర్చిన వారు నిజంగానే క్రూరత్వానికి పాల్పడ్డారా..? అదనపు కట్నం కోసం వేధించారా..? అనేదానికి పక్కా ఆధారాలు ఉండటం చట్టప్రకారం ముఖ్యమని కోర్టు

# పాకిస్థాన్ చర్యలకు తగిన పర్యవసానాలు ఉంటాయ్..

**ఐక్యరాజ్యసమితి భద్రతామండలి వేదికగా భారత్ వార్నింగ్**



**న్యూఢిల్లీ, మే 27 (నేటి దర్శిని)**
ఐక్యరాజ్యసమితి భద్రతామండలి వేదికగా పాకిస్థాన్ పై భారత్ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. సరిహద్దు ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ, సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత వంటి సూత్రాలను పాకిస్థాన్ యథేచ్ఛగా ఉల్లంఘిస్తోందని ఆరోపించింది. తమపై జరిగే ఉగ్రదాడుల నుంచి తమను తాము రక్షించుకునే పూర్తి హక్కు తమకు ఉందని, పాకిస్థాన్ చర్యలకు తగిన పర్యవసానాలు ఉంటాయని గట్టిగా హెచ్చరించింది. చైనా అధ్యక్షతన జరిగిన యూఎన్‌ఎస్‌సీ బహిరంగ చర్చలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి హరీశ్ పర్వతనేని మాట్లాడుతూ.. పాకిస్థాన్ చేసిన ఆధారరహిత ఆరోపణలను తిప్పికొట్టారు.స్వతంత్ర భారతదేశం ఏర్పడిన నాటి నుంచి నిత్యం సరిహద్దు ఆక్రమణలకు వ్యతిరేకంగా పోరాడుతోందని హరీశ్ పర్వతనేని అన్నారు. చట్టబద్ధంగా, తిరిగి మార్చలేని విధంగా భారత్‌లో విలీనమైన భూభాగాలను ఆక్రమించుకోవడానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తూనే ఉందని ఆయన చారిత్రక వాస్తవాలను గుర్తుచేశారు. భారత్‌ను వెయ్యి గాయాలతో రక్తమోడించాలనే పాకిస్థాన్ సిద్ధాంతం, వారి డొల్ల మాటలను బట్టబయలు చేస్తోందని అన్నారు. సరిహద్దు ఉగ్రవాదం నుంచి తనను రక్షించుకునే పూర్తి హక్కు భారత్‌కు ఉందని స్పష్టంచేశారు. తన చర్యలకు పాకిస్థాన్ తగిన పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. ఉగ్రవాదం, మత ఛాందసవాదం, హింసాత్మక రాడికలిజం వంటి దుష్టశక్తులను పాకిస్థాన్ నిరంతరం ప్రోత్సహిస్తోందని, ఇకనైనా ఉగ్రవాదానికి అన్ని విధాలుగా మద్దతును శాశ్వతంగా నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకుముందు ఇదే చర్చలో పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ మాట్లాడుతూ.. జమ్మూకశ్మీర్ అంశాన్ని, సింధు జలాల ఒప్పందాన్ని ప్రస్తావించారు. దీనికి భారత్ బలంగా బదులిచ్చింది. 2025 ఏప్రిల్‌లో పహల్గామ్‌లో 26 మంది పౌరుల మరణానికి కారణమైన ఉగ్రదాడి తర్వాతే భారత్ సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిందనే సంగతి గుర్తుంచుకోవాలని చెప్పింది.


# దేవరకొండలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

● టీడీపీ జెండా ఆవిష్కరించిన వస్కుల కృష్ణయ్య



**దేవరకొండ, మే 27 (నేటి దర్శిని):**
ఎన్టీఆర్ జయంతి వేడుకల సందర్భంగా దేవరకొండలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జ్ వస్కుల కృష్ణయ్య పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను ప్రతి ఏడాది మే 27, 28, 29 తేదీలలో మహానాడు వేదికగా ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. ఈసారి కొన్ని కారణాల దృష్ట్యా వేడుకలను వర్చువల్ విధానంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. దానిలో భాగంగా బుధవారం దేవరకొండలో పార్టీ జెండా ఆవిష్కరణ చేసి సంబరాలు నిర్వహించామని, గురువారం ఎన్టీఆర్ జయంతిని మరింత ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు గర్వపడే విధంగా తెలుగుదేశం పార్టీని ముందుకు నడిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మాచారి, కోతి అమరేందర్ రెడ్డి, ఉప్పల రమేష్, డాక్టర్ విజయ్ కుమార్, గార్లపాటి శ్రీను, సీత సీతారాములు యాదవ్, బోడ దనయ్య యాదవ్, ఏలేటి నరసింహ, దొడ్డి శ్రీను, పెద్దన్న, సాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# మిడ్జిల్ మండల ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు



మిడ్జిల్ మాజీ సర్పంచ్ బరిగెల శారద వెంకటయ్య



చిల్వేర్ గ్రామ సర్పంచ్ బోల్లం. నాగరాజ్ గౌడ్



మున్ననూర్ గ్రామ సర్పంచ్ చిట్టంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి



మిడ్జిల్ ఉప సర్పంచ్.మావిళ్ళ మమత మన్యం,







● తెలిపిన మండల కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్, సర్పంచులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు

**మిడ్జిల్, మే 27, (నేటి దర్శిని ప్రతినిధి):**
మిడ్జిల్ ముస్లింలు గురువారం నాడు జరుపుకోనె బక్రీద్ వేడుకను పురస్కరించుకుని మిడ్జిల్ మండల మాజీ సర్పంచ్ బరిగెల శారద వెంకటయ్య, మునున్నూర్ గ్రామ సర్పంచ్ చిట్టంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి, చిల్వేర్ గ్రామ సర్పంచ్ బోల్గం నాగరాజుగౌడ్, మిడ్జిల్ కేంద్రంలోని ఉప సర్పంచ్, మావిళ్ళ మమత మన్యం, వార్డు సభ్యులు బరిగె ల రమేష్, పి. సరితా కృష్ణ, భారతి హరి గౌడ్, మండల రాజకీయ నాయకులకు, ప్రజలకు, గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ వేడుకను ఆధ్యాత్మిక వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం, సుహృద్భావ వాతావరణం వెల్లివిరియాలని కోరుకున్నారు. దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలలో నిమగ్నమైన ప్రజలు గురువారం నాటి వేడుకను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

# గాయపడిన యువకులను పరామర్శించిన ఎమ్మెల్యే బాలునాయక్





**దేవరకొండ, మే 27 నేటి దర్శిని ప్రతినిధి :**
ద్విచక్ర వాహన ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ బీఎన్ రెడ్డి లైఫ్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పరామర్శించారు. చందంపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన బుడిగపాక ఇద్దయ్య కుమారుడు పవన్‌తో పాటు దేవరకొండ మండలం శేరిపల్లి పెద్ద తండాకు చెందిన యువకుడు, చందంపేట మండలం చీత్రియాలకు చెందిన మరికొందరు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆసుపత్రికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఎమ్మెల్యే కోరారు. బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో చందంపేట మాజీ ఎంపీపీ ఏడుపుల గోవింద్ యాదవ్, కోరుట్ల మాజీ సర్పంచ్ దొండేటి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు దీటుగా కేజీబీవీలు

● పదో తరగతిలో 98.47%, ఇంటర్‌లో 71.18% ఉత్తీర్ణత
● నీట్, జేఈఈ, క్లాట్‌కు ఉచిత శిక్షణలు
● అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలి : జీఈసీఓ అరుంధతి



**నల్గొండ, మే 27 (నేటి దర్శిని):**
నల్గొండ జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా రాణిస్తూ బాలికల విద్యాభివృద్ధికి ఆదర్శంగా నిలుస్తున్నాయని జిల్లా జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ అరుంధతి తెలిపారు.కేజీబీవీలలో సాధారణ విద్యతో పాటు నీట్, జేఈఈ, క్లాట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ అందిస్తున్నామని, ఉపాధి అవకాశాలకు దోహదపడే వృత్తి విద్యా కోర్సులను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని 27 కేజీబీవీలలో 24 విద్యాలయాలను ప్రభుత్వం ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్ చేసిందని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులతో పాటు ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ, కంప్యూటర్ సైన్స్ వంటి వొకేషనల్ కోర్సులను అందిస్తున్నామని చెప్పారు.

**ఫలితాల్లో అద్భుత ప్రగతి**
ఇంటర్మీడియట్ ఫలితాల్లో కేజీబీవీ విద్యార్థినులు జిల్లా వ్యాప్తంగా 71.18 శాతం ఉత్తీర్ణత సాధించగా, పదో తరగతిలో 27 కేజీబీవీలలో 16 పాఠశాలలు వంద శాతం ఫలితాలు సాధించి రికార్డు సృష్టించాయని వెల్లడించారు. అన్ని కేజీబీవీల సగటు ఉత్తీర్ణత 98.47 శాతంగా నమోదైందన్నారు.


**సమిష్టి కృషితో విజయాలు**
జిల్లా విద్యాధికారి భిక్షపతి, జీఈసీఓ అరుంధతి నిరంతర పర్యవేక్షణ, మార్గదర్శకత్వంతో ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అధికారులు తెలిపారు. ఎంఈఓలు, ప్యానెల్ అధికారుల సూచనలతో బోధన సిబ్బంది విద్యార్థినులను ప్రణాళికాబద్ధంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు.

**ఉచిత శిక్షణలు -- ప్రత్యేక క్యాంపులు**
విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ విద్యా సంవత్సరంలో నీట్, జేఈఈ, క్లాట్ పరీక్షలకు ఉచిత కోచింగ్ అందించామని తెలిపారు. అదనంగా ఎంసెట్, పాలీసెట్ శిక్షణ తరగతులు, సమ్మర్ క్యాంపులు నిర్వహించామని చెప్పారు. పరీక్షల్లో వెనుకబడిన విద్యార్థినుల కోసం ప్రత్యేక సప్లిమెంటరీ క్యాంపులు కూడా ఏర్పాటు చేసినట్లు వివరించారు.

**బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యం**
జిల్లాలో బాలికల నమోదు శాతాన్ని పెంచాలని, ఎక్కడా బాల్య వివాహాలు జరగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులను, పాఠశాల సిబ్బందిని జీఈసీఓ ఆదేశించారు. బాలికల అక్షరాస్యత, సమగ్ర అభివృద్ధే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**అడ్మిషన్లను సద్వినియోగం చేసుకోవాలి**
జిల్లాలోని ప్రతి బాలిక కేజీబీవీలలో లభిస్తున్న ఉచిత విద్యా అవకాశాలను వినియోగించుకొని తమ భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవాలని అరుంధతి సూచించారు. జిల్లాలోని 24 ఇంటర్మీడియట్ కళాశాలలు, 27 కేజీబీవీలలో ప్రవేశాల కోసం ఆసక్తి గల విద్యార్థినులు తమకు నచ్చిన కోర్సుల్లో వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధిత కుటుంబానికి రూ.2 లక్షల సహాయం అందించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి



**నాగోల్, మే 27 (నేటి దర్శిని):**
ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని నాగోల్ డివిజన్ జైపూరి కాలనీలో నివాసం ఉంటున్న రుక్మిభాయ్ వెన్నుపూస సంబంధిత ఆరోగ్య సమస్యతో బాధపడుతుండగా, కుటుంబ ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి, బాధితురాలి వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా ఆర్థిక సహాయం మంజూరు చేయించేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు రూ.2 లక్షల ఎల్.ఓ.సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరు కాగా, బాధిత కుటుంబ సభ్యుడు రోహిత్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు సేవ చేయడం ద్వారా ఎంతో సంతృప్తి లభిస్తుందని తెలిపారు. తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో పేద కుటుంబాలకు సేవ చేసే అవకాశం దక్కిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ తల్లి ఆరోగ్య సమస్య విషయంలో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం అందించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సహాయాన్ని జీవితాంతం మరువలేమని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్.బి.నగర్ నియోజకవర్గ సీనియర్ నాయకులు అనంతుల రాజిరెడ్డి, చైతన్యపురి యువ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ మహిళా నాయకురాలు శైలజ తదితరులు పాల్గొన్నారు.

# సురవరం జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో ఘనంగా శతావధానం ప్రారంభం





**హైదరాబాద్, మే 27 (నేటి దర్శిని):**
తెలంగాణ వైతాళికుల్లో ఒకరైన సురవరం ప్రతాపరెడ్డి 130వ జయంతి సందర్భంగా రవీంద్రభారతిలో రెండు రోజుల శతావధాన కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు భాషా చైతన్య సమితి, గోల్కొండ సాహితీ కళా సమితి, విశ్వభారతి మ్యాక్ సొసైటీ లిమిటెడ్, నక్క వెంకటమ్మ యాదవ్ - నక్క యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషనల్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మలుగ అంజయ్య శతావధాని నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ ప్రారంభ సభకు అర్ధ చంద్రప్రకాశ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కేవీ రమణాచారి పాల్గొనగా, విశిష్ట అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నందిని సిద్ధారెడ్డి హాజరై శతావధానాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేవీ రమణాచారి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి పేరు తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టడం ఆనందదాయకమన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని శతావధానం నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. అవధాన ప్రక్రియ ప్రాచీన కాలం నుంచి కొనసాగుతున్న గొప్ప సాహిత్య సంప్రదాయమని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు ఆర్థిక వనరులు అవసరమని, వాటికి సహకరించడం ఆనందంగా ఉందన్నారు. మలుగ అంజయ్య మరింత కీర్తి పొందాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులు, పృచ్ఛకులకు శుభాకాంక్షలు తెలిపారు. నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ కాలం ప్రతి ఒక్కరిపై ఒక బాధ్యతను మోపుతుందని, తెలంగాణ సమాజాన్ని చైతన్యపరిచే బాధ్యతను సురవరం ప్రతాపరెడ్డి విజయవంతంగా నిర్వర్తించారని అన్నారు. అందువల్లే ఆయన తెలంగాణ వైతాళికునిగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. 2017 ప్రపంచ తెలుగు మహాసభల్లో మలుగ అంజయ్య అష్టావధానం నిర్వహించినప్పుడే ఆయన శతావధానిగా ఎదగాలని ఆకాంక్షించానని, అది ఇప్పుడు నిజమైందని తెలిపారు.

కార్యక్రమంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్. బాలాచారి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, డాక్టర్ సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి, తెలుగు భాషా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బడేసాబ్, ఆచార్య జయరాములు, రామకృష్ణ చంద్రమౌళి, నక్క శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఎడ్ల కల్లేష్, ఎల్. జగన్, మండల గురునాథం, కే. సత్యనారాయణ, ఆవ మల్లయ్య, టి. సురేష్, ఎస్. నరేందర్ తదితరులు పాల్గొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖ పద్యకవులు పృచ్ఛకులుగా పాల్గొని మూడు ఆవృత్తాలను పూర్తి చేశారు. గురువారం జరిగే ముగింపు సభకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి. చిన్నారెడ్డి హాజరుకానున్నారు. మరో ఐదు ఆవృత్తాలతో శతావధానం ముగియనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.





# ఉప్పల్ భగయత్‌లో అక్రమ షెడ్ల దందా






- లక్షల్లో వసూళ్లు అధికారుల మౌనం, నాయకుల బ్రోకరేజ్ ఆరోపణలు
- బ్రోకర్లుగా మారి అడ్డుకుంటున్న కొందరు రాజకీయ నాయకులు
- భారీగా లంచాలు తీసుకొని కనీసం నోటీసులు కూడా ఇవ్వని టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్, ఏసిపి
- అధికారుల అవినీతికి అంతం లేకపోవడంతో దివాలా తీస్తున్న మున్సిపల్ శాఖ
- మున్సిపల్ శాఖ అవినీతి అక్రమాలపై దృష్టి పెట్టని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**ఉప్పల్, మే27 (నేటి దర్శిని):**
ఉప్పల్ సర్కిల్ అంటేనే అవినీతి అక్రమాలకు కేంద్రంగా మారింది. అధికారుల లంచాల దాహానికి ఎటుచూసినా అవినీతి, అక్రమాలు జోరుగా జరుగుతున్నాయని ఇందులో కొంతమంది రాజకీయ నాయకులు బ్రోకర్లుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్న పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. ఉప్పల్ భగాయత్ పరిధిలో అక్రమ షెడ్లు, అనుమతులు లేని నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిహెచ్ఎంసి అనుమతులు లేకుండా భారీ షెడ్లు, గోదాములు, వాణిజ్య నిర్మాణాలు వెలుస్తున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు లంచాలు తీసుకొని కళ్లుమూసుకుని చూస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ నిబంధనలు పేదలకు మాత్రమేనా.? డబ్బులు ఇచ్చేవారికి చట్టాలు వర్తించవా.? అంటూ ప్రజలు మండిపడుతున్నారు.

**ఒక్కో షెడ్డు నుంచి లక్షల్లో వసూళ్లు.?**
అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వ్యవహారాల్లో కొంతమంది టౌన్ ప్లానింగ్ అధికారులు భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక్కో అక్రమ షెడ్డు నుంచి లక్షల రూపాయలు తీసుకుంటూ మేమున్నాం, ఎలాంటి ఇబ్బంది రాదు అంటూ హామీలు ఇస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఫిర్యాదులు వచ్చినా కూల్చివేతలు లేకుండా కేవలం సెటిల్మెంట్లతో వ్యవహారం ముగుస్తోందని ప్రజలు అంటున్నారు.

**రాజకీయ నాయకుల బ్రోకరేజ్ వ్యవహారం.?**
కొంతమంది స్థానిక రాజకీయ నాయకులు, వారి అనుచరులు బ్రోకర్లుగా మారి అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. "ఇంత మొత్తం ఇవ్వండి, అధికారులు, నాయకులు అందరం చూసుకుంటాం" అంటూ అక్రమ నిర్మాణదారులతో ఒప్పందాలు కుదురుస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రముఖ నాయకుల, ప్రజా ప్రతినిధుల పేర్లు చెప్పుకుంటూ అక్రమార్కులు ఫిర్యాదుదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**జిహెచ్ఎంసి ఆదాయానికి భారీ గండి**
అసలే జిహెచ్ఎంసి అప్పుల్లో మునిగిపోతుంటే అక్రమ నిర్మాణాలు మాత్రం ఆకాశాన్ని అంటుతున్నాయి అధికారులు లంచాలు తీసుకొని కోట్లు గడిస్తూ జిహెచ్ఎంసి ఆదాయానికే దర్జాగా గండి కొడుతుంటే ఇటు జోనల్ కమిషనర్, ఎం ఎం సి కమిషనర్ పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మున్సిపల్ శాఖ నష్టాలలో ఉన్న కమిషనర్లు నిమ్మకు నేరని తిన్నట్లు వ్యవహరిస్తే పరిస్థితి ఎలా చక్కబడుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగడం వల్ల జిహెచ్ఎంసికి రావాల్సిన ఫీజులు, పన్నులు ప్రభుత్వ ఖజానాకు చేరకుండా కొందరి అవినీతి అధికారుల జేబుల్లోకి వెళ్తున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకుంటే లక్షల్లో, కోట్లలో ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అవినీతి కారణంగా ఆ మొత్తాలు అక్రమ మార్గాల్లో మాయం అవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ఉప్పల్ సర్కిల్‌కు నిబంధనలు వర్తించవా.?**
జిహెచ్ఎంసి ఇతర ప్రాంతాల్లో చిన్నచిన్న నిర్మాణాలపైనా నోటీసులు జారీ చేస్తూ కూల్చివేతలు చేపడుతుంటే ఉప్పల్ సర్కిల్‌లో మాత్రం భారీ అక్రమ షెడ్లు, నిర్మాణాలు అవుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. "సాధారణ ప్రజలు చిన్న మార్పు చేసినా వెంటనే నోటీసులు ఇచ్చి కూల్చివేతాలు చేస్తారు కానీ పెద్ద అక్రమ నిర్మాణాలపై, షెడ్ల పై ఎందుకు మౌనం.? అని స్థానికులు నిలదీస్తున్నారు.

**ఫిర్యాదులు చేసినా స్పందన శూన్యం**
ఉప్పల్ సర్కిల్ పరిధిలో అధికారులను అవినీతి ఎంత తీవ్రస్థాయికి చేరిందంటే సాక్షాత్ డిప్యూటీ కమిషనర్‌కు, టౌన్ ప్లానింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పత్రికలో కథనాలు వచ్చిన పట్టించుకోవాలని లంచాలు ఇస్తే చాలు కిందిస్థాయి నుండి ఉన్నత అధికారుల వరకు వాటాలు వెళ్లి కేవలం ఫైళ్లు తిప్పడం, విచారణ పేరుతో కాలయాపన చేయడం తప్ప అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. "ఓన్లీ సెటిల్మెంట్.. నో యాక్షన్" అనే మాటలు ఇప్పుడు ఉప్పల్ భగయత్ ప్రాంతంలో బహిరంగ చర్చగా మారాయని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వానికి కోట్ల నష్టం వస్తుందని దానితో ప్రత్యేక దృష్టి సారించాలన్న డిమాండ్ స్థానికుల నుండి పెరుగుతుంది. ఉప్పల్ భగయత్ పరిధిలో సాగుతున్న అక్రమ షెడ్లు, అనుమతి లేని నిర్మాణాలపై ఎం ఎం సి కమిషనర్, ఉప్పల్ జోనల్ కమిషనర్, ఉన్నతాధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి, రాజకీయ జోక్యంపై విజిలెన్స్ దర్యాప్తు జరిపి జిహెచ్ఎంసి ఆదాయాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. "అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపకపోతే ఉప్పల్ ప్రాంతం మొత్తం అవినీతి అడ్డాగా మారిపోతుంది" అని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# వరద సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు.

- 6 కోట్ల కాలువ పనులకు స్థల పరిశీలన
- రాఘవేంద్ర కాలనీ--కుమ్మరి కుంట వరద కాలువ నిర్మాణానికి మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి



**హయత్ నగర్, మే 27 (నేటి దర్శిని):**
ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ నుంచి కుమ్మరి కుంట వరకు ప్రతి వర్షాకాలంలో ఏర్పడుతున్న వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ సమస్య నివారణ కోసం దాదాపు రూ.6 కోట్ల వ్యయంతో వరద నీటి కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించగా, నేడు మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి నిర్మాణ ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ ఏడాది వర్షాకాలంలో కాలనీల్లో భారీగా నీరు నిలిచిపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాఘవేంద్ర కాలనీ నుంచి కుమ్మరి కుంట వరకు చేపట్టనున్న వరద నీటి కాలువ నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యకు చాలా వరకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించామని తెలిపారు. నిర్మాణ పనులు ప్రారంభానికి ముందు అన్ని ప్రాంతాలను సమగ్రంగా పరిశీలించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి, నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ శివకృష్ణ, ఏఈ సాయికృష్ణ, రాఘవేంద్ర కాలనీ ప్రధాన కార్యదర్శి చిన్న, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# హయత్‌నగర్‌లో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల ముఖ్య సమావేశం

- సర్ కార్యక్రమాన్ని బూత్ స్థాయికి తీసుకెళ్లాలి : కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, మే 27 (నేటి దర్శిని):**
భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హయత్‌నగర్ డివిజన్‌లో సర్ (Special Intensive Revision) కార్యక్రమంపై బూత్ స్థాయి కార్యకర్తల ముఖ్య సమావేశం మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి నివాసంలో నిర్వహించారు. ఈ సమావేశానికి హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర శాఖ ఇచ్చిన పిలుపు మేరకు సర్ కార్యక్రమాన్ని ప్రతి బూత్ స్థాయికి తీసుకెళ్లి విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని అర్హులైన ప్రతి ఓటరు పేరు నమోదయ్యేలా కృషి చేయాలని అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రాబోయే రోజుల్లో పార్టీ చేపట్టే కార్యక్రమాల్లో అందరూ సమన్వయంతో పాల్గొని పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, సర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ప్రతి బూత్‌లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, హయత్‌నగర్ ప్రభారీ కొత్త రవీందర్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇంచార్జీలు, బూత్ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు మరియు పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలి

- త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి
- యుటోరి జూనియర్ కళాశాలను ప్రారంభించిన స్వామీజీ
- అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రవచనం చేశారు





**హైదరాబాద్, మే27 (నేటి దర్శిని):**
విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలలో రాణించాలని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి పేర్కొన్నారు. నగరంలోని తార్నాక స్ట్రీట్ నెంబర్. 5 నూతనంగా ఏర్పాటు చేసిన యుటోరి జూనియర్ కళాశాలను ముఖ్యఅతిథిగా పద్మభూషణ్ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి జీ హాజరై స్వామీజీ కర కమలములచే జ్యోతి ప్రజ్వలన చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ప్రవచనం చేశారు. విద్యార్థులు చదువుతోపాటు ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని సూచించారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత చేగురుతుందని, ధ్యానము, యోగ కేంద్రాలు ఆధ్యాత్మిక ఎదుగుదలకు ఆరోగ్యకరమైన జీవన విధానానికి మార్గము సుగమము అవుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో యుటోరి కళాశాల చైర్మన్ డాక్టర్ టి ఉదయభాస్కర్, డైరెక్టర్ టి ప్రదీప్ కుమార్, సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షానికి తడిసిన ధాన్యం

- పడిపోయిన విద్యుత్ స్తంభాలు



**ఎలిగేడు, మే 27 (నేటి దర్శిని):**
బుధవారం రాత్రి మండలంలో వీచిన భారీ ఈదురుగాలులు, వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతోపాటు కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి ధాన్యం తడవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ర్యాకల్దేవుపల్లి గ్రామంలో కరెంట్ స్తంభం విరిగి పడటంతో దానిపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోయింది. ముప్పిరితోటలో కూడా విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. మండలంలోని పలు గ్రామాల్లో వరి ధాన్యం తడవడంతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. "ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు పూర్తి చేయాలి. లేకపోతే రైతులు భారీ నష్టాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది" అని బాధిత రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

తెలుగు దిన పత్రిక
RNI NO: TGTEL/25/A0471
WWW.NETIDARSHINI.COM
సత్య శోధనే మా లక్ష్యం
www.epaper.netidarshini.com
గురువారం 28-05-2026

# బిజినెస్

# రూ.200 లకే జియో కొత్త 'ఓటీటీ పాస్'..

### 15 ప్రీమియం యాప్‌లు, అన్‌లిమిటెడ్ 5G డేటా!

రిలయన్స్ జియో తన వినియోగదారుల కోసం సరికొత్త ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. కేవలం రూ. 200 ధరతో సరికొత్త 'జియో ఓటీటీ పాస్' (జీఅశీ ూఖ ూఖం)ను ఈరోజు విడుదల చేసింది. ఒకే రీఛార్జ్‌తో మొబైల్ కనెక్టివిటీతో పాటు మెరుగైన వినోదాన్ని అందించే లక్ష్యంతో ఈ 28 రోజుల ప్యాక్‌ను కంపెనీ ప్రవేశపెట్టింది. ఈ సరికొత్త ప్యాక్ ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా వినియోగదారులందరికీ అందుబాటులోకి వచ్చింది. అయితే దీనిని యాక్టివేట్ చేసుకోవాలంటే కస్టమర్ల మొబైల్‌లో ఏదైనా యాక్టివ్ బేస్ ప్లాన్ ఉండటం తప్పనిసరి. ఈ సరికొత్త ప్యాక్ ద్వారా వినియోగదారులకు 15 ప్రీమియం ఓటీటీ యాప్‌ల సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది. ఇందులో యూట్యూబ్ ప్రీమియం, జియోహాట్‌స్టార్ మొబైల్ ం హాలీవుడ్ (లైవ్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ ఒరిజినల్స్, హాలీవుడ్ సినిమాలు), అమెజాన్ ప్రైమ్ వీడియో మొబైల్ ఎడిషన్లు ఉన్నాయి. వీటితో పాటు జియోటీవీ యాప్ ద్వారా యాక్సెస్ చేసుకోగలిగే సోనీలివ్, జీ5, లయన్స్ గేట్ ప్లే, డిస్కవరీ ప్లస్, సన్ నెక్స్ట్, ఫ్యాన్‌కోడ్, కాంచా లంకా, ప్లానెట్ మరాఠీ, చౌపాల్, హోయిచోయ్, టైమ్స్ ప్లే, తరంగ్ ప్లస్ వంటి మరో 12 ఓటీటీల సబ్‌స్క్రిప్షన్ కూడా ఇందులో




లభించబోతున్నాయి. ఇక ఈ వినోదంతో పాటు జియోటీవీ (జీఅశీఎ) యాప్ ద్వారా కస్టమర్లు 1,000 కి పైగా లైవ్ టీవీ ఛానళ్లను ఉచితంగా వీక్షించవచ్చు. ఇందులో 150 కి పైగా పెయిడ్ ఛానళ్లు కూడా ఉన్నాయి. ఇక డేటా ప్రయోజనాల విషయానికి వస్తే, ఈ ప్లాన్ ద్వారా వినియోగదారులకు 30 GB హై-స్పీడ్ 4G/5G డేటా లభించబోతుంది.

# ఎలక్ట్రిక్ కారును ఆవిష్కరించిన ఫెరారీ



**న్యూఢిల్లీ:**
లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఫెరారి . కొత్తగా పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ కారను ఆవిష్కరించింది. లూస్ అనే ఆ కారు ఖరీదు సుమారు ఆరున్నర లక్షల డాలర్లు. ఇటలీ బ్రాండ్ ఫెరారీ కంపెనీ తొలిసారి ఫైవ్ సీటర్ వాహనాన్ని తయారు చేసింది. లవ్‌ఫ్రమ్ ఏజెన్సీ సహకారంతో దీన్ని డిజైన్ చేశారు. సోషల్ మీడియాలో కొత్త ఎలక్ట్రిక్ ఫెరారీ కారుపై ప్రశంసలు కురుస్తున్నాయి. మాస్టర్‌క్లాస్ డిజైన్‌లో ఉన్నట్లు కొందరు పేర్కొన్నారు. అయితే ఎలక్ట్రిక్ కార్ల వ్యాపారంలో ప్రస్తుతం డిమాండ్ తక్కువగా ఉంది. దీంతో సూపర్ కార్లు తయారు చేసే లాంబోర్గిని, పోర్స్ కంపెనీలు ప్రస్తుతం ఈవీ కార్లను అనుకున్నంత ఉత్పత్తి చేయడం లేదు. చైనా బ్రాండ్ల నుంచి తీవ్రమైన పోటీ ఉన్న నేపథ్యంలోనూ లగ్జరీ కంపెనీలు ఈవీ కార్లను లాంచ్ చేయలేకపోతున్నాయి. లూస్ అంటే ఇటలీ భాషలో కాంతి అని, ఈ కారును డెవలప్ చేసేందుకు అయిదేళ్లు పట్టిందని ఫెరారీ సీఈవో బెనడెట్టో విగ్నా తెలిపారు. లూస్ ఎలక్ట్రిక్ కారు వీల్స్‌కు ఎలక్ట్రిక్ మోటార్లు ఉన్నాయని, కేవలం 2.5 సెకన్లలో ఆ కారు 96 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుందని ఫెరారీ నిపుణులు చెబుతున్నారు. కారుకు సంబంధించిన అన్ని పరికరాలను ఇన్‌హౌజ్‌లోనే తయారీ చేసినట్లు చెప్పారు.

# స్థిరంగా బంగారం ధరలు.. ఎలా ఉన్నాయంటే

బంగారం ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ కారణాలతో ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అనిశ్చితి కారణంగా బంగారానికి డిమాండ్ కొనసాగుతోంది (+శీశ్రీస ఖఅస ాఅశ్రీజవతీ =ఛ్వం). ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లు, కరెన్సీ మార్కెట్లు ఆటుపోట్లకు లోనవుతున్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం స్థిరంగా కొనసాగుతున్నాయి గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, బుధవారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,58,880గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,45,640గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,030గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,45,790గా ఉంది . మరోవైపు వెండి ధరలు కూడా స్థిరంగా కొనసాగుతున్నాయి (ాఅశ్రీజవతీ



జూతీఅఎవర్ శీఖుఎ). ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,94,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,84,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2,94,900గా, బెంగళూరులో రూ.2,84,900గా ఉంది.

**గమనిక:** బంగారం, వెండి ధరలు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి కొనుగోలు చేసే ముందు ఒకసారి ధరలను చెక్ చేసుకోవలసిందిగా సూచన.

# అనవసర నిర్ణయమే గుజరాత్ కొంపముంచింది

### టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్

గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో పాటు టీమ్ మేనేజ్‌మెంట్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు గుప్పించాడు. వారు తీసుకున్న పనికిమాలిన నిర్ణయమే గుజరాత్ టైటాన్స్ విజయవకాశాలను దెబ్బతీసిందన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ)తో జరిగిన క్వాలిఫయర్-1లో సమష్టిగా విఫలమైన గుజరాత్ టైటాన్స్ 92 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. ఈ భారీ విజయంతో ఆర్‌సీబీ ఫైనల్‌కు దూసుకెళ్లగా.. గుజరాత్ టైటాన్స్‌కు క్వాలిఫయర్-2 ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మ్యాచ్ గురించి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన అశ్విన్.. కీలకమైన క్వాలిఫయర్-1లో కుల్వంత్ ఖేజ్రోలియాను ఎందుకు ఆడించారో తనకు అర్థం కావడం లేదన్నాడు. అతను ఒకే ఓవర్‌లో 28 పరుగులు ఇచ్చాడని, అది మ్యాచ్ మూమెంటమ్‌ను మార్చేసిందని అభిప్రాయపడ్డాడు. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ తీసుకున్న నిర్ణయాలు, బౌలింగ్ మార్పులు కూడా సరిగ్గా లేవని విమర్శించాడు.'రషీద్ ఖాన్‌కు ఈ సీజన్ అంత బాగా సాగలేదు. ఐపీఎల్ 2026 సీజన్ మొత్తం స్పిన్నర్లకు అంత గొప్పగా ఏమీ లేదు. కానీ మిగతా స్పిన్నర్లతో పోలిస్తే రషీద్ ఖాన్‌కు ఇది కాస్త మెరుగైన సీజన్ అని చెప్పవచ్చు. అయితే, ఏడో ఓవర్ లోనే రషీద్‌ను బౌలింగ్‌కు దించకుండా శుభ్‌మన్ గిల్ ఒక మంచి అవకాశాన్ని



చేజార్చుకున్నాడనేది నా వ్యక్తిగత అభిప్రాయం. ఈ ఐపీఎల్‌లో శుభ్‌మన్ గిల్ అత్యుత్తమ కెప్టెన్లలో ఒకడిగా కాకపోయినా.. మెరుగైన కెప్టెన్లలో ఒకడిగా రాణించాడు. ముఖ్యంగా అతను తన బ్యాటింగ్ శైలిని మార్చుకున్న విధానానికి నేను హాట్సాఫ్ చెప్తాను. అయితే వారి జట్టులో కొన్ని బలహీనతలు, లోపాలు ఉన్నాయి. వాటిని వారు హోమ్ అడ్వాంటేజ్‌ను ఉపయోగించుకుని కవర్ చేశారు.తటస్థ వేదికలో ఆర్‌సీబీ.. గుజరాత్ టైటాన్స్ లోపాలను బట్టబయలు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలవడం చాలా కీలకం. శుభ్‌మన్ టాస్ గెలిచి ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. కానీ ఈరోజు వారు కుల్వంత్ ఖేజ్రోలియాను ఎందుకు ఆడించారో నాకు అస్సలు అర్థం కాలేదు. మీరు ఎవరినైనా ఆడించాలనుకుంటే, వారి బౌలింగ్‌లో ఏదైనా మిస్టరీ ఉండాలి. అతనేమీ మిస్టరీ స్పిన్నర్ లేదా మిస్టరీ బౌలర్ కాదు. ఇప్పటికే కొన్ని మ్యాచ్‌లు ఆడాడు. 15వ ఓవర్‌లో ఏకంగా 28 పరుగులు వచ్చాయి. అది ఆటను పూర్తిగా మార్చేసింది.'అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ 255 పరుగుల భారీ లక్ష్యాన్నినిర్దేశించగా.. గుజరాత్ టైటాన్స్ 162 పరుగులకే కుప్పకూలింది. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగే ఎలిమినేటర్ విజేతతో గుజరాత్ టైటాన్స్ క్వాలిఫయర్-2 ఆడనుంది.

# స్పోర్ట్స్

# ధోనీ భవితవ్యం మా చేతుల్లో లేదు..

### ఏ నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తాం..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌లో మహేంద్ర సింగ్ ధోనీ ఆడకపోవడంతో అతడి భవితవ్యం ఏంటీ? అనేది చర్చనీయాంశంగా మారింది. హుందాగా వీడ్కోలు పలికుతాడా లేదా చెన్నై సూపర్ కింగ్స్ కోచ్, మెంటర్, క్రికెటర్ డైరెక్టర్ .. వంటి పదవులు చేపడుతాడా? అనేది అంతుచిక్కడం లేదు. ఎందుకంటే.. పెద్దన్నలాంటి మహీ భాయ్‌ను సీఎస్కే యాజమాన్యం ఎట్టి పరిస్థితుల్లనూ వదులుకోదు. ఈ నేపథ్యంలో సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ ధోనీ భవితవ్యం మా చేతుల్లో లేదని కుండబద్దలు కొట్టేశాడు.ఐపీఎల్‌లో ధోనీ శకం ముగిసిందా? అనే ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. పంతొమ్మిదో సీజన్‌కు దూరమవ్వడంతో.. ఇకపై ఆటగాడిగా ధోనీని మైదానంలో చూడలేమని, కోచ్‌గా వస్తాడని ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే.. సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ ధోనీ భవితవ్యం తమ చేతుల్లో లేదని స్పష్టం చేశాడు. ఇదివరకు చెప్పనట్టే.. ధోనీని తాము అడ్డుకోమని, అతడికి నచ్చినన్ని రోజులు ఆడనిస్తామని చెప్పాడు.'ధోనీ గురించి మేము ఇప్పుడే ఆలోచించడం లేదు. అతడి భవితవ్యాన్ని అతడికే వదిలేశాం. అతడు ఏ నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తాం. సీఎస్కే ఫ్రాంచైజీలో ధోనీని శాశ్వత సభ్యుడిగా భావిస్తాం. ఆటగాడిగా లేదంటే కోచ్‌గా లేదా మెంటర్‌గా.. అతడు ఏది ఇష్టపడితే అదే హోదాలో కొనసాగేందుకు అనుమతిస్తాం. ఏ నిర్ణయమైనా అతడి చేతుల్లోనే ఉంది. ధోనీ, కోచ్ ఫ్లెమింగ్‌లు రుతురాజ్ గైక్వాడ్‌ను ప్రశాంతమైన కెప్టెన్‌గా తీర్చిదిద్దారు. గైక్వాడ్ సారథ్యంలో సీఎస్కే గొప్ప విజయాలు సాధిస్తుంది' అని విశ్వనాథన్ వెల్లడించాడు.ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ధోనీ గైర్హాజరీలో తీవ్రంగా నిరాశపరిచింది. 19వ సీజన్‌లో ఆరు విజయాలతో ప్లే ఆఫ్స్‌కు దూరమైంది. కీలక ఆటగాళ్లకు గాయాలు, సమిష్టితత్వం కొరవడడం.. బౌలింగ్ యూనిట్‌లో అన్షుల్ కంబోజ్ ఒక్కడే రాణించడం వంటివి చెన్నై జట్టును ఇంటికి పంపించాయి.

# టీ20 క్రికెట్ హిస్టరీలోనే సరికొత్త మైలురాయి

ఇండియన్ ప్రీమియర్ లీ 2026 క్వాలిఫయర్ 1 మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పతిదార్ హిస్టారికల్ పర్ఫార్మెన్స్ తో సరికొత్త చరిత్ర సృష్టించాడు. మంగళవారం గుజరాత్ టైటాన్స్ తో జరిగిన హై-వోల్టేజ్ పోరులో పాటిదార్ బౌండరీల వర్షం కురిపించాడు. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 33 బంతుల్లోనే 5 ఫోర్లు, 9 భారీ సిక్సర్ల సాయంతో 93 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్ ఆడే క్రమంలో ఆయన ఐపీఎల్ 2026 సీజన్ లో తన మొత్తం సిక్సర్ల సంఖ్యను 41 కి చేర్చాడు. ఈ అద్భుతమైన ఫీట్ ద్వారా ఒకే టీ20 టోర్నమెంట్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన కెప్టెన్‌గా ప్రపంచ క్రికెట్ లోనే సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఒకే టీ20 సిరీస్ లేదా టోర్నమెంట్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన కెప్టెన్ రికార్డు గతంలో రాజస్థాన్ రాయల్స్ ప్రెసెంట్ కెప్టెన్ రియాన్ పరాగ్ పేరిట ఉండేది. 2023-24 డొమెస్టిక్ సీజన్ లో జరిగిన సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అస్సాం జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తూ మొత్తం 40 సిక్సర్లను పరాగ్



సాధించాడు. తాజా మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ పై 9 సిక్సర్లు బాదడం ద్వారా రజత్ పతిదార్ ఆ మార్కును అధిగమించి 41 సిక్సర్లతో అగ్రస్థానానికి చేరుకున్నాడు. పతిదార్ బ్యాటింగ్ పవర్ చూసి స్టేడియంలోని ఫ్యాన్స్ అంతా ఫుల్ జోష్ లో మునిగిపోయారు.ఇక ఐపీఎల్ రికార్డుల విషయానికి వస్తే ఒకే ఐపీఎల్ సీజన్ లో కెప్టెన్‌గా అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు ఇప్పటివరకు శ్రేయస్ అయ్యర్ పేరిట ఉండేది. ఆయన ఐపీఎల్ 2025 సీజన్ లో పంజాబ్ కింగ్స్ జట్టుకు నాయకత్వం వహిస్తూ 39 సిక్సర్లు బాదాడు. గుజరాత్ టైటాన్స్ తో జరిగిన క్వాలిఫైయర్ 1 మ్యాచ్ ద్వారా పాటిదార్ ఆ రికార్డును ఈజీగా క్రాస్ చేశాడు. ఒక ఐపీఎల్ ఎడిషన్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఏకైక కెప్టెన్‌గా సరికొత్త మైలురాయిని సెట్ చేశాడు. కెప్టెన్సీ ప్రెజర్ ఉన్నప్పటికీ పతిదార్ ఆడిన ఇన్నింగ్స్ ఆర్‌సీబీని మెరుగైన స్థితిలో నిలిపింది.గుజరాత్ తో జరిగిన ఈ నాకౌట్ మ్యాచ్ లో పతిదార్ సిక్సర్ల విధ్వంసం అతడిని ఐపీఎల్ ఎలైట్ లిస్ట్ లో చేర్చింది. ఒకే మ్యాచ్ లో 9 సిక్సర్లు కొట్టడం ద్వారా ఐపీఎల్ లో ఒక ఇన్నింగ్స్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన వీరుల జాబితాలో విరాట్ కోహ్లీ, క్రిస్ గేల్, ఇషాన్ కిషన్ వంటి ప్లేయర్లను ఆయన వెనక్కి నెట్టారు. క్వాలిఫయర్ 1 లాంటి అత్యంత ఒత్తిడితో కూడిన మ్యాచ్ లో ఆర్‌సీబీ కెప్టెన్ చూపించిన ఈ అగ్రెసివ్ బ్యాటింగ్ శైలి జట్టుకు భారీ స్కోరు అందించడమే కాకుండా ఫైనల్ చేరాలనే నమ్మకాన్ని రెట్టింపు చేసింది.



చీరకట్టులో నిద్ర పట్టనీయకుండా చేస్తున్న రుక్మిణి

## నాని కెరీర్‌లోనే
# ‘ఆయా షేర్’ రికార్డ్



‘ది ప్యారడైజ్’ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు అగ్ర హీరో నాని. ‘దసరా’ఫేం శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ప్రచారంలో భాగంగా విడుదలైన ఈ సినిమాలోని తొలి పాట ‘ఆయా షేర్’ నేటికీ సంచలనాలు సృష్టిస్తూనే ఉన్నదని మేకర్స్ తెలిపారు.తాజాగా ఈ పాట కేవలం తెలుగు వెర్షన్‌లోనే 150 మిలియన్ వ్యూస్, 1.6 మిలియన్ లైక్స్ సాధించి, నాని కెరీర్‌లోనే అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన పాటగా నిలిచిందని, సోషల్ మీడియానూ, పబ్లిక్‌ని ఈ పాట షేక్ చేస్తున్నదని మేకర్స్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పాటలో శ్రీకాంత్ ఓదెల సృష్టించిన రఫ్ అండ్ రస్టిక్ ప్రపంచం, నాని పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, డాన్స్ మూమెంట్స్ అందర్నీ ఆకట్టుకుంటున్నాయని, అనిరుధ్ ఎనర్జిటిక్ బీట్ పాటను మరో స్థాయికి తీసుకెళ్లగా, కాసర్ల శ్యామ్ సాహిత్యం, జంగిరెడ్డి, అర్జున్ చాందీ గానం ఈ పాటకు ప్రధాన ఆకర్షణలుగా నిలిచాయని మేకర్స్ అంటున్నారు.

# జపాన్ అభిమానులకు షాక్ ఇచ్చిన పెద్ది..

### -రామ్‌చరణ్ సినిమా విడుదలపై కీలక నిర్ణయం



గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా, దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన పాన్ ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా పెద్దిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్న జపాన్ అభిమానులకు ఇప్పుడు ఊహించని షాక్ తగిలింది. మొదట్లో చిత్రబృందం పెద్ది సినిమాను భారతదేశంతో పాటు జపాన్‌లో కూడా అదే రోజున విడుదల చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సమాచారం. గతంలో ఆర్ఆర్ఆర్ సినిమా జపాన్‌లో భారీ విజయం సాధించడంతో అక్కడ రామ్‌చరణ్‌కు మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది. ఆ సినిమా ద్వారా ఆయన నటనకు జపాన్ ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించింది.ఒకవేళ అదే రోజు విడుదల జరిగి ఉంటే అంతర్జాతీయ బాక్సాఫీస్ వద్ద భారీ స్థాయిలో కలెక్షన్లు నమోదు అయ్యే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇక పెద్ది చిత్రంలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు.విడుదల తేదీ దగ్గరపడుతున్న కొద్దీ సినిమాపై అంచనాలు పెరుగుతుండగా, జపాన్ విడుదల వాయిదా వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# కమల్‌హాసన్‌ను కలిసిన భాగ్యశ్రీ భోర్సే



కోలీవుడ్ నటుడు శివ కార్తికేయన్ ’సెయాన్’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కమల్ హాసన్ సొంత నిర్మాణసంస్థపై ఈ సినిమా రానుంది. ఇందులో హీరోయిన్‌గా నటిస్తోన్న భాగ్యశ్రీ బోర్సే తాజాగా కమల్‌ను కలిశారు. ఆయనతో దిగిన ఫొటోలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. డియర్ కమల్ హాసన్ సర్.. చిన్నప్పటినుంచి మిమ్మల్ని చూస్తూ పెరిగాను. ఇప్పుడు ఆ చిన్న అమ్మాయి మీ సినిమాలో నటిస్తోంది. మీరు నా తలపై చేయి వేసి ఆశీర్వదించిన క్షణాలను వర్ణించడానికి మాటలు సరిపోవు. మీరు గర్వపడేలా చేస్తానని ప్రామిస్ చేస్తున్నా అని భాగ్యశ్రీ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫోటో, ఆమె పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ’అమరన్’ విజయం తర్వాత శివకార్తికేయన్.. కమల్‌హాసన్ సొంత నిర్మాణసంస్థలో చేస్తున్న రెండో చిత్రమిది. శివకుమార్ మురుగేశన్ తెరకెక్కిస్తున్నారు. ‘ఇది గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా. కుటుంబ ప్రేక్షకుల్ని అలరించే భావోద్వేగాలు, మాస్ యాక్షన్, వినోదాన్ని మిళితం చేసుకుని ఉంటుందని టీమ్ తెలిపింది. ఈ సినిమా అక్టోబరులో థియేటర్లలోకి రానుంది.

# సమ్మర్ హాలిడేస్ టీజర్ విడుదల

ఏ మిడిల్ క్లాస్ బయోపిక్’తో అందరికీ చేరువయ్యాడు నటుడు రోహన్. ఈ సమ్మర్‌లో మరోసారి నవ్వులు పంచేందుకు వచ్చేశాడు. రోహన్, అరుణ్ ప్రధానపాత్రల్లో రానున్న చిత్రం ’సమ్మర్ హాలీడేస్’. శ్రీకర్ నాయన్ తెరకెక్కిస్తున్నారు. జయసుధ, వాసుకీ ఆనంద్, రాజీవ్ కనకాల కీలకపాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను చిత్ర బృందం పంచుకుంది.




Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365